
ఆంధ్రజ్యోతి


రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
మంగళవారం 2 ఏప్రిల్ 2024



రైతులు, నేతన్నలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి - బీజేపీ డిమాండ్

కాంగ్రెస్ చేతగానితనంతోనే సముద్రంలోకి నీళ్లు

8



ధాన్యం కొనుగోళ్లు ఘురూ


వీర్నపల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభం

- ఎన్నికల కోడ్ ఎఫెక్ట్‌తో కనిపించని సందడి
- తొలి రోజు 30 కేంద్రాలు ప్రారంభం
- 259 కేంద్రాల ఏర్పాటు లక్ష్యం
- దిగుబడి అంచనా 3.81 లక్షల మెట్రిక్ టన్నులు
- జిల్లాలో 1.73 లక్షల ఎకరాల్లో వరి సాగు
- మొదలైన వరికోతలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలు జిల్లా వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. మరోవైపు యాసంగి వరికోతలు మొదలయ్యాయి. దీంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో అన్నదాతలు వరికోతలు, వడ్ల కొనుగోళ్లతో బీజీగా మారిపోయారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లాలో సోమవారం అన్ని మండలాల్లో అధికారుల సమక్షంలో సందడి లేకుండా కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. గతంలో మాదిరిగానే అన్ని గ్రామాల రైతులకు కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉండే విధంగా సన్నాహాలు చేశారు. జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉండగా 259 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయనున్నారు. ఐకేపీ ద్వారా 44 కేంద్రాలు, సింగిల్ విండోల ద్వారా 201 కేంద్రాలు, డీసీఎంఎస్ ద్వారా 10 కేంద్రాలు, మెప్మాద్వారా నాలుగు కేంద్రాలు, ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు ఉపయోగించడానికి గన్నీ బ్యాగులు కొత్తవి 21.85 లక్షలు, ఇప్పటికే ఉపయోగించినవి 5.28 లక్షలు అందుబాటులో ఉన్నాయి. కొనుగోళ్ల కోసం టార్పాలిన్లు, 8024, ఇన్నోవింగ్ మిషన్లు 265, పాడీ క్లీనర్‌లు 610, మ్యాయిశ్చరైజ్ మీటర్లు 550, వేయింగ్ మిషన్లు 700, అస్క్ రిమూవర్స్ 265, వంటి పరికాలు సిద్ధంగా ఉంచారు. జిల్లాలో 100 రైస్‌మిల్లులు ఉండగా 72 రా రైస్‌మిల్లు, 28 బాయిల్డ్ రైస్‌మిల్లులు ఉన్నాయి. వీటికి ధాన్యాన్ని కేటాయించే విధంగా చర్యలు చేపట్టారు. రైస్ మిల్లర్లతో సమావేశాలు నిర్వహించి దానికి అనుగుణంగా కేటాయింపు చేస్తున్నారు.

• పౌర సరఫరాల లక్ష్యం 3 లక్షల మెట్రిక్ టన్నులు

జిల్లాలో యాసంగి సీజనల్‌లో 1.73 లక్షల వరి సాగు ద్వారా 3.81 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనాలు వేశారు. ఇందులో 81 వేల మెట్రిక్ టన్నులు మిల్లర్లు నేరుగా కొనుగోలు చేస్తారని భావిస్తున్నారు. పౌర సరఫరాల శాఖ ద్వారా 3 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏప్రిల్ మొదటి వారం నుంచి 50 వేల మెట్రిక్ టన్నులు, మేలో 2.50 లక్షల మెట్రిక్ టన్నులు, జూన్‌లో 81 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌లోకి వస్తుందని అంచనాలు వేశారు. ఇందులో పౌరసరఫరాల శాఖ ఏప్రిల్‌లో 50 వేలు, మేలో 2,09,500, జూన్‌లో 40,500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగే విధంగా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ధాన్యాన్ని రైతులు రోడ్లపై ఆరబోసుకుంటున్నారు.

• అన్నదాత దిగాలు

యాసంగి ధాన్యం దిగుబడి రైతుల్లో ఆశలను పెంచలేకపోతోంది. కాళేశ్వరం జలాలు ఈసారి ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ప్రధానంగా ఉన్న మిడ్ మానేరు ప్రాజెక్ట్ 27.50 టీఎంసీల సామర్థ్యం ఉండగా ప్రాజెక్ట్‌లో 8.27టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. అన్నపూర్ణ ప్రాజెక్ట్‌లో 3.50 టీఎంసీలకు 0.80 టీఎంసీలకు పడిపోయింది. మరోవైపు చెరువులు కుంటలు, బోరుబావుల్లో భూగర్భ జలాలు అడుగంటడంతో పొలాలకు నీళ్లు అందని పరిస్థితి. జిల్లాలో పది మీటర్ల లోతులోకి నీళ్లు పడిపోయాయి. జిల్లాలో యాసంగిలో వరి సాగు పెంచుకుంటూ 1.73 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఒక వైపు పంట ఎండిపోతుండగా చేతికి అందివచ్చిన పంటల కోతలతో రైతులు పనుల్లో నిమగ్నమయ్యారు. జిల్లాలో వరి కోతలు జోరుగా సాగుతున్న దానికి అనుగుణంగానే కొనుగోలు కేంద్రాలు కూడా ప్రారంభం అయ్యాయి. జిల్లాలో వరి సాగులో గంభీరావుపేటలో 17,318 ఎకరాలు, ఇల్లంతకుంట 25,024, ముస్తాబాద్ 19,903, సిరిసిల్ల 4783, తంగళ్లపల్లి 18,851, వీర్నపల్లి 6204, ఎల్లారెడ్డిపేట 16,512, బోయినపల్లి 13,073, చందుర్తి 15,182, కోనరావుపేట 17,141, రుద్రంగి 4112, వేములవాడ 5142, వేములవాడ రూరల్‌లో 10,487 ఎకరాల్లో సాగు చేశారు. పంటలు ఎండిపోతుండడంతో దిగుబడి రాదని పశువుల మేతకు రైతులు వదిలి వేస్తుండగా మరికొందరు రైతులు పొలాలను దహనం చేసి సాగునీటి కోసం నిరసన తెలుపుతున్నారు.

సూర్యుడు 'మండే'

• జిల్లాలో 42.5 డిగ్రీలు నమోదు



సిరిసిల్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో సోమవారం సూర్యుడు మండిపోయాడు. జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రత 33.5 డిగ్రీలు, గరిష్ఠ ఉష్ణోగ్రత 42.5 డిగ్రీలుగా నమోదైంది. ప్రజలకు బయటకు రావడానికే ఇబ్బంది పడే పరిస్థితులు ఏర్పడ్డాయి. జిల్లాలో ఉష్ణోగ్రత నమోదు వివరాలు ఇలా ఉన్నాయి.

మండలం	ప్రాంతం	కనిష్ఠం	గరిష్ఠం
కోనరావుపేట	మర్తనపేట	33.5	42.5
చందుర్తి	మర్రిగడ్డ	31.7	41.5
ఇల్లంతకుంట	పెద్దలింగాపూర్	32.6	41.5
వీర్నపల్లి	వీర్నపల్లి	32.2	41.3
రుద్రంగి	రుద్రంగి	32.3	40.3
సిరిసిల్ల	సిరిసిల్ల	33.7	40.2
తంగళ్లపల్లి	నేరేళ్ల	31.2	40.2
వేములవాడ	నాంపల్లి	32.1	40.1
ముస్తాబాద్	నామాపూర్	32.3	40.0
బోయినపల్లి	బోయినపల్లి	32.3	39.7
వేములవాడ రూరల్	మల్లారం	32.4	39.4
ఎల్లారెడ్డిపేట	ఎల్లారెడ్డిపేట	31.9	38.9

నా ఫోన్‌ను ట్యాప్ చేశారు

- సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఫిర్యాదు

సిరిసిల్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తన ఫోన్ కూడా ట్యాపింగ్ చేశారని సోమవారం హైదరాబాద్‌లో సీపీకి ఫిర్యాదు చేశారు. సిరిసిల్లలో వార్ రూం ఏర్పాటు చేశారని, ప్రణీత్‌రావు కూడా అక్కడే అరెస్ట్ చేయడంతో తన ఫోన్ కూడా ట్యాపింగ్ తేటతెల్లమైందని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌పై ఫిర్యాదు చేసినట్లు మహేందర్‌రెడ్డి తెలిపారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రీవెన్స్ డేతో బాధితులకు సత్వర న్యాయం

సిరిసిల్ల క్రైం , ఏప్రిల్ 1 : బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా గ్రీవెన్స్‌డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ తగాదాలు, ఆస్తి తగాదాల విషయంలో నిబంధనలకు న్యాయం అందించే విధంగా చూడాలని సూచించారు. గ్రీవెన్స్‌డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని, సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని తెలిపారు.

నేటి నుంచి పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 1:మండలంలోని వెల్జీపూర్‌లో మంగళవారం నుంచి పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామంలో గతంలో ఉన్న పోచమ్మతల్లి ఆలయం శిథిలావస్థకు చేరడంతో ఆలయాన్ని నిర్మించినట్లు పేర్కొన్నారు. మంగళవారం గణపతిపూజ, మంగళతోరణం, సహస్ర ఘట జలాభిషేకం, 3న యంత్రాలకు అభిషేకం, అష్టలక్ష్మి కుంకుమపూజ, 4న యంత్రప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ ఉంటాయని తెలిపారు.

పెండింగ్ ఆస్తి పన్ను వసూళ్లను పూర్తి చేయాలి

ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 1: గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్ను వసూళ్లను అధికారులు సకాలంలో పూర్తి చేయాలని డీఎల్‌పీవో మల్లికార్జున్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గొల్లపల్లి గ్రామాలను సోమవారం సందర్శించారు. పన్నుల వసూళ్ల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ ఆస్తిపన్నుల వసూళ్లలో రాజన్న సిరిసిల్ల జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.13 లక్షల ఆస్తి పన్నుల వసూలుకు అధికారులు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని అన్నారు. ఎంపీవో వజీర్ అహ్మద్, పంచాయతీ కార్యదర్శులు దేవరాజు, రామకృష్ణ ఉన్నారు.

పోలింగ్ సిబ్బందికి శిక్షణ అందించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 1: జిల్లాలో జరిగే పార్లమెంట్ ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించాలని వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఎన్‌ఐసీ సమావేశ మందిరంలో వేములవాడ రెవెన్యూ డివిజన్ అధికారి రాజేశ్వర్ పోలింగ్ రోజు పోలింగ్ కేంద్రాల ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు చేయవలసిన విధులపై సెక్టోరల్ అధికారులు, మాస్టర్ ట్రైనర్లకు పీపీటీ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై సంపూర్ణ అవగాహన కల్గి ఉండాలన్నారు. ఈ సమావేశంలో సీపీవో ట్రైనింగ్‌నోడల్ అధికారి పీబీ శ్రీనివాస చారి, మాస్టర్ ట్రైనర్స్ తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాకు స్పందన

గంభీరావుపేట, ఏప్రిల్ 1 : గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు స్పందన లభించింది. 65 మంది నిరుద్యోగ అభ్యర్థులు హాజరయ్యారు. వీఎల్‌ఆర్ కంపెనీలో ఎనిమిది మంది, అమెజాన్‌లో షార్ట్ లిస్ట్‌లో ఎనిమిది, బీజెడ్ ఫిన్సర్వ్‌లో 12 మంది అభ్యర్థులు సెలక్ట్ అయ్యారని ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీవల్లీ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ దర్మపురి ఉన్నారు.

గడ్డివాము దగ్ధం

కోనరావుపేట, ఏప్రిల్ 1: కోనరావుపేట మండలం మంగళ్లపల్లె గ్రామంలో నిల్వ ఉన్న పశుగ్రాశం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని దగ్ధమైంది. గ్రామానికి చెందిన మొగిలిపాల కిష్టయ్య అనే రైతుకు చెందిన పశుగ్రాసం నిప్పు అంటుకుంది. గమనించిన రైతులు మంటలు వ్యాపించకుండా ఆర్పి వేశారు.

ఎండలతో అప్రమత్తంగా ఉండాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 1 : ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నందున, తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఎండ దెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు ఖీమ్యానాయక్, పూజారి గౌతమితో కలిసి ఎండ దెబ్బ తగిలితే తీసుకోవాల్సిన జాగ్రత్తల సూచించే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎండదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని, ఎండల్లో బయట తిరగవద్దని అన్నారు. అత్యవసర పరిస్థితితో తప్ప ప్రజలు బయటికి రాకూడదని, మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల మధ్య ఎట్టి పరిస్థితులలో ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచించారు. ఎండాకాలంలో నిలిపి ఉన్న వాహనాలలో పిల్లలు, పెంపుడు జంతువులను వదల వద్దని, ఎండలలో పనిచేయవద్దని అన్నారు. ఆల్కాహాల్, టీ, కాఫీ, స్వీట్స్, చల్లని డ్రింక్స్ తీసుకోవద్దన్నారు. చెప్పులు లేకుండా బయట నడవ వద్దన్నారు. చిన్నారులు, వయోవృద్ధులు ఇంటికే పరిమితం కావాలని, ప్రతీ రోజు సరిపడా నీరు తీసుకోవాలని అన్నారు. వదులుగా ఉన్న దుస్తులను ధరించాలని, బయటికి వెళ్లేటప్పుడు గొడుగు లేదా టోపీని ధరించాలని అన్నారు. ద్వి చక్రవాహనాలపై సుదూర ప్రయాణాలు చేయకూడదన్నారు. సూర్యుడి కిరణాలు శరీరంపై పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండలో పనిచేసే కార్మికులు తరచూ నీటితో పాటు ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని తీసుకోవాలని, వడదెబ్బ నుంచి శరీరాన్ని కాపాడు కోవచ్చని అన్నారు. చర్మంపై ఎర్రటి దద్దుర్లు, చర్మం పొడిబారడం వంటి మార్పులను గమనించాలన్నారు. అధిక శరీర ఉష్ణోగ్రత, అలసట, నోరు ఎండి పోవడం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, వాంతులు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే సమీప ప్రభుత్వ ఆసుపత్రులలో సంప్రదించాలని, లేదా 108కు ఫోన్ చేసి చికిత్స అవసరమైన మందులు పొందాలని అన్నారు. జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

త్వరలోనే మర్రిపల్లి రిజర్వాయర్ పనులు ప్రారంభం

వేములవాడ రూరల్, ఏప్రిల్ 1: మర్రిపల్లి రిజర్వాయర్ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. నాగాయపల్లి, పోశెట్టిపల్లి గ్రామాల్లో సోమవారం జరిగిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాల్లో మాట్లాడారు. రాష్ట్రంలో సాగునీటికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నామన్నారు. వేములవాడ నియోజకవర్గంలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణాన్ని అసెంబ్లీ బుక్‌లో చేర్చారన్నారు. గత పాలకులు మర్రిపల్లి రిజర్వాయర్‌ను పట్టించుకోలేదన్నారు. రైతు భరోసాపై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని, ఇప్పటి వరకు 5 ఎకరాలలోపు వారికి రైతు భరోసాను అందించామని అన్నారు. గత ప్రభుత్వం ఏప్రిల్ నాటికి రైతుబంధు ఇచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏప్రిల్‌కు ముందుగానే రైతు బంధు ఇచ్చిందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోపే ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు గ్యారెంటీలను అమలు చేస్తున్నామన్నారు. పదేళ్ల నియంతృత్వ పరిపాలనకు చరమగీతం పాడి ప్రజా ప్రభుత్వ ఏర్పాటులో తోడ్పాటునందించిన వేములవాడ నియోజకవర్గ ప్రజలకు, రాష్ట్ర ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు వకులా భరణం శ్రీనివాస్, నాయకులు సంఘ స్వామి, రొండిరాజు, తిరుపతిరెడ్డి, చిలుక రమేష్ పాల్గొన్నారు.


నాగాయపల్లిలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ప్రణాళికతో తాగునీటి సరఫరా చేపట్టాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 1: రానున్న రెండు నెలల పాటు పక్కా ప్రణాళికతో తాగునీటి సరఫరా చేపట్టాలని, ప్రజలకు ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు వహించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి కలెక్టర్ అనురాగ్ జయంతితోపాటు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ నుంచి తాగునీటి సరఫరా ప్రణాళిక, ధాన్యం కొనుగోలు, పాఠశాల మౌలిక వసతుల కల్పనపై జిల్లా కలెక్టర్, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో ప్రతీ రోజు తాగునీటి సరఫరాను పర్యవేక్షించాలని, ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని అన్నారు. తాగునీటి సరఫరా నిమిత్తం మిషన్ భగీరథ ద్వారా అందుబాటులో ఉన్న వ్యవస్థను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. తాగునీటి సరఫరాను పర్యవేక్షించేందుకు మండల స్థాయిలో, గ్రామస్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. మిషన్ భగీరథ వ్యవస్థ, స్థానికంగా అందుబాటులో ఉన్న నీటి వనరులతో రూపొందించిన ప్రత్యామ్నాయ వ్యవస్థలను వినియోగించుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితులలో స్థానికంగా ఉన్న వ్యవసాయ మోటార్లను వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. పట్టణాలు, గ్రామాల్లో తాగునీటి సరఫరా ఇబ్బందులు ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో తాగునీటి సరఫరాలో ఉత్పన్నమయ్యే సమస్యలను వెంటనే గుర్తించాలని, వాటిని సత్వరం పరిష్కారం అయ్యే విధంగా చూడాలని అన్నారు. ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో భూగర్భ జలాలు తగ్గి పోతున్నాయని, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలలో సైతం ట్యాంకర్లకు డిమాండ్ పెరిగే అవకాశం ఉందని అన్నారు. ట్యాంకర్ బుక్ చేసిన వెంటనే సకాలంలో సరఫరా చేసే విధంగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా వరి కోతలు జరుగుతున్న నేపథ్యంలో అవసరమైన మేర ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని, కొనుగోలు కేంద్రం లేని కారణంగా రైతులు ప్రైవేట్‌కు తక్కువ ధరకు ధాన్యం విక్రయిస్తున్నారనే మాట రావద్దని స్పష్టం చేశారు. కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. వైద్య ఆరోగ్యశాఖ వారితో జారీ చేసిన వేసవికాలంలో వడదెబ్బ నుంచి రక్షించుకుందాం చేయాల్సిన పనులు, చేయకూడని పనుల వివరాల పోస్టర్‌ను ఆవిష్కరించినారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యా నాయక్, డీఈవో రమేష్ కుమార్, డీఎంఅండ్‌హెచ్‌వో సుమన్ మోహన్‌రావు, ఏవో రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరిధి దాటితే కేసులు నమోదు



మాట్లాడుతున్న వేములవాడ డీఎస్పీ నాగేంద్ర చారి

వేములవాడ రూరల్, ఏప్రిల్ 1: ప్రతీ ఒక్కరు ఎన్నికల నియమావళిని పాటించాలని, చట్ట పరిధి దాటితే కేసులు నమోదు చేస్తామని వేములవాడ డీఎస్పీ నాగేంద్ర చారి అన్నారు. సోమవారం రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో పలు రాజకీయ పార్టీ నాయకులతో ఎన్నికలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రతీ ఒక్కరు సహకరించాలన్నారు. గతంలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి సహకరించిన విధంగానే రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు స్వచ్ఛందంగా శాంతియుత వాతావరణంలో ఓటు వినియోగించుకోవడంలో నాయకులు సహకరించాలన్నారు. రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై మారుతీ పాల్గొన్నారు.

పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట, ఏప్రిల్ 1 : పురాతన ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో సోమవారం కొండ మైసమ్మ జాతర మహోత్సవంలో మాట్లాడారు. అమ్మవారి దీవెనలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, చందనగిరి గోపాల్, కచ్చకాయల ఎల్లయ్య, బాల్‌రెడ్డి, చేపూరి గంగాధర్, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, లింబయ్య, పల్లె మంజుల, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక పూజల్లో ఆది శ్రీనివాస్

రైస్‌మిల్లుల్లో ధాన్యం కోత విధించవద్దు

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 1: ధాన్యాన్ని కోతలు లేకుండా రైస్‌మిల్లుల్లో దిగుమతి చేసుకోవాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ కోరారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం యాసంగి 2023-24 సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ బియ్యం సరఫరాపై రా, బాయిల్డ్ రైస్‌మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందదర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ సీజన్‌లో 67 రా రైస్‌మిల్లులు, 30 పారా బాయిల్డ్ రైస్‌మిల్లులకు మొత్తం 2,00,715.160 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి కొనుగోలు చేసి మిల్లులకు ఇచ్చామని, ఈ ధాన్యానికి 1,34,588 టన్నుల బియ్యం ప్రభుత్వానికి రావాల్సి ఉండగా ఇప్పటి వరకు 8236 టన్నుల బియ్యం అందించారని అన్నారు. ఇంకా 1,26,427 టన్నుల బియ్యం మిల్లర్ల దగ్గర నుంచి ప్రభుత్వానికి రావాల్సి ఉందన్నారు. తహసీల్దార్లు మండలాల పరిధిలో ఉన్న రైస్ మిల్లుల ద్వారా ప్రతీ రోజు 75 లారీల బియ్యాన్ని సరఫరా చేసేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, జిల్లా మేనేజర్ జితేంద్ర ప్రసాద్, అన్ని మ ండలాల తహసీల్దార్లు, మ్లిలర్ల సంఘం అధ్యక్షుడు చేపూరి నాగరాజు, పబ్బ నాగరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్


ఆలయాలకు సరుకుల సరఫరాపై సమగ్ర విచారణ

- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

వేములవాడ, ఏప్రిల్ 1: రాష్ట్రంలోని ఆలయాలకు సరుకుల సరఫరా వ్యవహారంపై సమగ్ర విచారణ కోసం ఎంక్వయిరీ కమిషన్ ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. సోమవారం వేములవాడ రాజరాజేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ బాసర దేవాలయంలో సరుకుల రవాణా పేరిట పెద్ద ఎత్తున అక్రమాలు చేస్తున్న వైనంపై స్పందించారు. బాసర ఆలయంతో పాటు రాష్ట్రంలోని అన్ని దేవాలయాలకు ఒకే కాంట్రాక్టర్ అధిక ధరలకు సరుకులను సరఫరా చేస్తున్న వైనంపై తమకు అనేక ఫిర్యాదులు అందాయని, ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ కోసం ఎంక్వయిరీ కమిషన్ నియమిస్తున్నామని తెలిపారు. విచారణ అనంతరం నివేదికకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దేవుడి మాన్యాలకు సంబంధించి అనేక అవినీతి అక్రమాలు జరిగిన సందర్భాలు ఉన్నాయని, దేవుడి మాన్యాలు కబ్జాలు పెట్టిన సందర్భాలు ఉన్నాయని అంటూ దేవుళ్ల పేరు మీద ఆలయాలకు ఉన్న భూముల వివరాలు సేకరించి నివేదిక సమర్పించాల్సిందిగా దేవాదాయశాఖ అధికారులను ఆదేశించామన్నారు. రాష్ట్రంలో ఏ దేవాలయానికి ఏ ఏ సర్వే నంబర్లలో ఎంత భూమి ఉందనే విషయం పూర్తి నివేదిక రాగానే ఆలయాల పేరిట పాస్ పుస్తకాలు ఇప్పిస్తామన్నారు. విదేశాల్లో ఉన్నవాళ్లు రాష్ట్రంలోని దేవాలయాలకు విరాళం ఇవ్వడానికి ప్రత్యేక వెబ్ సైట్‌ను డిజైన్ చేస్తున్నామని, ఎన్నారైలు లేదా ఎవరైనా దాతలు తాము కోరుకున్న ఆలయానికి విరాళం ఇవ్వవచ్చని లేదా జనరల్‌గా కూడా విరాళం ఇచ్చే విధంగా ఏర్పాటు చేస్తామని అన్నారు. ప్రజలు, దాతల నుండి విరాళాలు సేకరిస్తామని, ఈ విరాళాలతో ఏర్పడిన ఫండ్ ద్వారా రాష్ట్రంలోని ఆలయాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. దర్శనం కోసం వచ్చే భక్తులను గతంలో దోచుకునే విధానం ఉండేదని ఇకముందు అలా జరగకుండా ప్రశాంత వాతావరణంలో భక్తులు దేవుడిని దర్శించుకునే పరిస్థితి కల్పిస్తామని తెలిపారు. రాష్ట్రంలో అతి పెద్ద శైవ క్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానం అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేకమైన ఆసక్తి ఉన్నదని, ఆలయ అభివృద్ధికి సంబంధించి ఇప్పటికే సీఎం ఆధ్వర్యంలో వీటీడీఏ సమావేశం జరిగిందని అన్నారు. రానున్న రోజుల్లో వేములవాడ దేవాలయాన్ని యాదగిరిగుట్ట దేవస్థానం తరహాలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఉన్నారు.


వేములవాడలో మంత్రి కొండా సురేఖ







రోడ్డు ప్రమాదంలో విద్యార్థినికి గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ విద్యార్థిని

తిమ్మాపూర్, ఏప్రిల్1: మండలంలోని ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్ సమీపంలో సోమవారం రాత్రి రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొని ఓ విద్యార్థిని తీవ్రంగా గాయపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లాకు చెందిన ఉప్పాల శ్రీహర్ష అనే విద్యార్థిని స్థానికంగా ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతూ సమీపంలోని ఓ గర్ల్స్ హాస్టల్‌లో ఉంటోంది.

సోమవారం రాత్రి హాస్టల్ నుంచి బయటికి వచ్చి రాజీవ్ రహదారిపై రోడ్డు దాటుతుండగా కరీంనగర్ నుంచి హైదారాబాద్ వైపునకు వెళ్తున్న ఓ యువకుడు బైక్‌ను అతివేగంగా నడుపుతూ ఆ విద్యార్థిని ఢీకొట్టాడు. ఈ సంఘటనలో శ్రీహర్షకు తీవ్రగా యాలు కాగా స్థానికులు, ఎల్ఎండి పోలీసులు 108 వాహనంలో కరీంన గర్‌లోని ఆసుపత్రికి తరలించారు. విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

రూ.7,450 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఏప్రిల్ 1: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,450 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 41మంది రైతులు 466క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,450, కనిష్ఠ ధర రూ.7వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఆలయాల్లో దొంగతనం

ఇబ్రహీంపట్నం, ఎప్రిల్ 1: మండలంలోని వర్షకొండ గ్రామంలో పలు దేవాలయల్లో అర్ధరాత్రి దొంగతనం జరిగినట్లు ఎస్‌ఐ అనిల్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, బ్రహ్మం గారి ఆలయం, పెద్దమ్మ, పంచముఖ, హన్‌మాన్ ఆలయలలో తాళాలు పగులగొట్టి దొంగతనం చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. దాదాపుగా 3.5 గ్రాముల బంగారు అభరణాలు దొంగిలించినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి రాకేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బెల్ట్ షాప్ నిర్వాహకుల బైండోవర్

శంకరపట్నం, ఏప్రిల్ 1: శంకరపట్నం మండలం కేశవపట్నం పోలీసులు సోమవారం బెల్ట్ షాపు నిర్వాహకులను తహసీల్దార్ కార్యాలయంలో హాజరు పరిచి బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని గద్దపాక, కాచాపూర్, రాజాపూర్, కన్నాపూర్, ధర్మారం గ్రామాలకు చెందిన 16మందిని తహసీల్దార్ కార్యాలయంలో హాజరు పరిచినట్లు తెలిపారు.







'నవోదయ' ప్రవేశ పరీక్ష ఫలితాల విడుదల

చొప్పదండి,ఏప్రిల్1: నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో జాతీయ స్థాయిలో నిర్వహించిన ప్రవేశపరీక్ష ఫలితాలు విడుదలైనట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. గత జనవరి 20న ఉమ్మడి జిల్లా స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించగా మెరిట్, కేటగిరీ వారీగా ఎంపికైన విద్యార్థుల జాబితాను విడుదల చేశారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 5న ఆధార్ కార్డు, హాల్‌టికెట్, ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో విద్యాలయంలో హాజరు కావాలని ఆమె తెలిపారు.

రాజరాజేశ్వర క్షేత్రంలో భక్తుల రద్దీ



భక్తులతో సందడిగా ఉన్న ఆలయ ప్రాంగణం



కోడె మొక్కు చెల్లించుకుంటున్న మంత్రి కొండా సురేఖ

వేములవాడ, ఏప్రిల్ 1: వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రం సోమవారం భక్తజనంతో కిక్కిరిసిపోయింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తమ ఇష్ట దైవమైన రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుని తరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించి సర్వదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయం సైతం భక్తులతో భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనం మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి కృష్ణప్రసాద్ నేతృత్వంలో అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

కల్యాణం టికెట్ల కోసం భక్తుల ఇబ్బందులు

రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానంలో స్వామివారి నిత్య కల్యాణం టికెట్ల కోసం భక్తులు ఇబ్బందులు పడ్డారు. శివ కల్యాణం ఉత్సవాల సందర్భంగా గత ఐదు రోజులుగా స్వామివారి నిత్య కల్యాణం టికెట్లు నిలిపి వేయగా, కల్యాణోత్సవాలు ముగిసిన నేపథ్యంలో సోమవారం స్వామివారి నిత్య కల్యాణం యథావిధిగా ప్రారంభించారు. కల్యాణంలో పాల్గొనేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ ముందు భాగంలోని కళాభవన్ మొదటి అంతస్తులో స్వామివారి నిత్య కల్యాణం నిర్వహిస్తారు. ఈ ప్రాంగణంలో పరిమిత సంఖ్యలోనే భక్తులు స్వామివారి కల్యాణంలో పాల్గొనడానికి వీలవుతుంది. గరిష్టంగా 180 టికెట్ల వరకు మాత్రమే జారీ చేస్తారు. కల్యాణోత్సవం టికెట్లు విక్రయం ప్రారంభించిన కొద్దిసేపట్లోనే టికెట్లు దాదాపుగా అయిపోయాయి. దీంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన అనేకమంది భక్తులు కల్యాణోత్సవం టికెట్ల కోసం ప్రయత్నాలు చేశారు. అయినప్పటికీ టికెట్ దొరకక పోవడంతో నిరాశకు గురయ్యారు. ఇదిలా ఉండగా సోమవారం స్వామివారి కోడె మొక్కు చెల్లింపు కోసం సైతం పెద్ద సంఖ్యలో భక్తులు బారులు తీరారు. ఆలయ గుడి చెరువు పార్కింగ్ స్థలం నుంచి ప్రారంభమైన క్యూలైన్‌లో భక్తులు కిక్కిరిసిపోయారు. కోడె మొక్కు చెల్లింపు కోసం భక్తులు రెండు నుంచి మూడు గంటలకు పైగా వీక్షించాల్సి వచ్చింది.

రాజన్న సేవలో మంత్రి కొండా సురేఖ

వేములవాడ: రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి సేవలో తరించారు. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించి స్వామివారి ప్రసాదం అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ఆమె వెంట ఉన్నారు.

ఉపాధి పనుల్లో కూలీకి తీవ్రగాయాలు

గంభీరావుపేట, ఏప్రిల్ 1: గంభీరావుపేట మండలం గోరంటాలలో సోమవారం ఉపాధి పనుల్లో కూలీకి తీవ్రగాయాలయ్యాయి. గ్రామానికి చెందిన బండ సత్తవ్వ రోజు మాదిరిగానే ఉపాధి పనికి వెళ్లింది. పనులు చేస్తుండగా సత్తవ్వ చేతిపై పార బలంగా తగలడంతో ఎడమ చేతి నాలుగు వేళ్లు అక్కడే తెగిపడ్డాయి. తీవ్రంగా గాయపడటంతో ముందుగా సిరిసిల్ల అక్కడి నుంచి కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి ఒకరికి తీవ్రగాయాలు

- రోడ్డుపై ధాన్యం కుప్పలతో ఘటన

వీర్నపల్లి, ఏప్రిల్ 1 : వీర్నపల్లి మండలం శాంతినగర్ గ్రామ శివారులో ప్రధాన రహదారిపై వరిధాన్యం కుప్ప ఎక్కడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి గంగాధర మండలానికి చెందిన భాస్కర్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. గంగాధర నుంచి సిరికొండ వైపు వెళ్తున్న భాస్కర్ రోడ్డుపై పోసిన వరి ధాన్యం కుప్పలను ఎక్కించడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి తలకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో చికిత్స కోసం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

యువతి ఆత్మహత్య

పెగడపల్లి, ఏప్రిల్1: మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన పూసల వైష్ణవి (20) అనే యువతి క్రిమిసంహారక మందు తాగి ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డిగ్రీ చదువుతున్న వైష్ణవి పరీక్షల్లో ఫెయిలయ్యానని బాధతో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందింది. వైష్ణవి తండ్రి రాజేశం ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జాడి రామకృష్ణ తెలిపారు.

ఘనంగా ఉగ్ర నారసింహుని ఏకాంతోత్సవం



ఉగ్ర నారసింహుని ఆలయంలో పూజలు



శేషప్ప కళావేదికపై చిన్నారుల నృత్య ప్రదర్శన

ధర్మపురి, ఏప్రిల్ 1: ధర్మపురి క్షేత్రంలో శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి (ఉగ్ర)వారల ఏకాంతోత్సవం సోమవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు రాత్రి వేళలో అందంగా పూలతో అలంకరించిన స్వామివారలకు ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను సేవలపై ఉంచి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. అర్ధరాత్రి స్వామివారల ఉత్సవ మూర్తులను వేదిక వద్దకు తీసుకవెళ్లారు. అనంతరం స్వామి వారలను పవళింపజేసి ఏకాంతోత్సవం నిర్వహించారు. దీంతో శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు ముగిశాయి. యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమాచార్యులు నేతృత్వంలో అర్ధరాత్రి వరకు కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు దర్శనం చేసుకుని ఉత్సవాన్ని తిలకించారు. అంతకు ముందు శేషప్ప కళావేదికపై హైదరాబాద్‌కు చెందిన శ్రీ సాయి సన్నిధి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో చిన్నారులచే నృత్య ప్రదర్శనలు భక్తులను ఎంతో ఆకట్టుకున్నాయి. కల్వచర్ల సీహెచ్ విష్ణు బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

లక్ష్యాన్ని అధిగమించిన ఎన్టీపీసీ

2023-24లో 16,645 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి

జ్యోతినగర్, ఏప్రిల్ 1: రామగుండం ఎన్టీపీసీ 2023-24 ఆర్థిక సంవత్సర విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించింది. ఈ ఆర్థిక సంవత్సరం 16,600 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా(ఎంవోయూ) నిర్ణయించగా మార్చి 26న ప్రాజెక్టు టార్గెట్‌ను సాధించింది. ఈ ఆర్థిక సంవత్సరం ప్రాజెక్టులో కొన్ని సాంకేతిక, వార్షిక మరమ్మతులు తదితర అవాంతరాలు ఎదురైనప్పటికీ లక్ష్యాన్ని సాధించడం విశేషం. ప్రాజెక్టులోని 500 మెగావాట్ల 7వ యూనిట్ నిరంతరాయంగా 305 రోజులపాటు విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నది. ఇన్ని రోజులపాటు యూనిట్ నిరాటంకంగా విద్యుత్ ఉత్పత్తిని కొనసాగించడం రికార్డుగా అధికారులు తెలిపారు. అలాగే 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ కేంద్రం 2023-24 ఆర్థిక సంవత్సరంలో 196.17 మిలియన్ యూనిట్ల రికార్డు విద్యుత్ ఉత్పత్తి నమోదైంది.



రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టు

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు

- బీజేపీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు ఎస్.కుమార్

భగత్‌నగర్, ఏప్రిల్ 1: దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి, మేనిఫెస్టో కమిటీ సభ్యుడు ఎస్.కుమార్ అన్నారు. సోమవారం కరీంనగర్‌లోని శుభమంగళ గార్డెన్స్‌లో జరిగిన బీజేపీ మేనిఫెస్టో కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ మేనిఫెస్టోలో యువత భాగస్వామ్యం కావాలన్నారు. దేశానికి ఏది అవసరమో యువత గుర్తించి లిఖిత పూర్వకంగా అందించాలన్నారు. పదేళ్లుగా దేశంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగా పనిచేసిందన్నారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అహర్నిషలు కృషి చేస్తోందన్నారు. మేనిఫెస్టోలో యువత భాగస్వామ్యం కోసం 17 పార్లమెంట్‌నియోజక వర్గాల్లో అభిప్రాయాలను లిఖిత పూర్వకంగా సేకరిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ యువత సూచనలు తీసుకుని బీజేపీ ప్రజా మేనిఫెస్టో రూపొందిస్తుందన్నారు. ఈ సమావేశంలో కరీంనగర్ పార్లమెంట్ ప్రభారి మీసాల చంద్రయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగ్గిళ్లపు రమేష్, గంగ్రనళిని, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దుర్శటి సంపత్, మాజీ మేయర్ డి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.



యువత నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్న కమిటీ సభ్యులు

కేసీఆర్ అనాలోచిత నిర్ణయంతోనే సాగు నీటి ఎద్దడి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 1: రబీ పంటల సాగు కోసం నీటి విడుదలకు సరైన ప్రణాళికలు రూపొందించకపోవడంతో పాటు కేసీఆర్ అనాలోచిత నిర్ణయంతోనే సాగు నీటి ఎద్దడి ఏర్పడిందని దీనికి పూర్తిగా కేసీఆరే నైతిక బాధ్యత వహించాలని ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో సోమవారం జీవన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్న నాయకులు ఇతర పార్టీలోకి వెళ్లడానికి కేసీఆర్ నిర్ణయాలు, ఎన్నికల ఫలితాల పతనమే కారణమన్నారు. తప్పులను కప్పిపుచ్చుకకునేందుకు, ప్రజల దృష్టిని మరల్చేందుకు కేసీఆర్ ఇప్పుడు జిల్లాల పర్యటన పేరుతో పంటల పరిశీలన చేయడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి భవిష్యత్‌లో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి పంటల బీమా పథకం అమలు చేసేలా చర్యలు చేపడుతున్నారన్నారు. గడిచిన ఐదేళ్ల లో పూర్తి స్థాయిలో రుణ మాఫీ చేయని కేసీఆర్ ఇపుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజులకే రుణ మాఫీ ఏమైందని అడుగడం హాస్యాస్పదమన్నారు. బీజేపీకి రైతు సంక్షేమం పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ పార్టీ కనుమ రుగు కాబోతుందన్నారు. రాష్ట్ర ఖజానాను కేసీఆర్ ఖాళీ చేశాడని దీంతో రాష్ట్రం పూర్తిగా అప్పుల్లో కూరుకుపోయిందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

పంటలు ఎండిపోవడానికి కేసీఆరే పూర్తి బాధ్యుడని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. ధర్మపురి నియోజకవర్గ సమస్యలపై రాష్ట్ర మంత్రిగా వ్యవహరించిన ఈశ్వర్ ఏనాడైనా కేసీఆర్ దృష్టికి తీసుకవెళ్లాడా అని ప్రశ్నించారు. రైతులపై కపట ప్రేమ చూపించేందుకు గాను దొంగ దీక్ష చేపట్టడం సరైంది కాదన్నారు. రాజకీయంగా పేరు తెచ్చిన ఉమ్మడి కరీంనగర్‌కు కేసీఆర్ ఏమి చేయలేదన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయ లక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్త మోహన్, క్లబ్ సెక్రటరీ పుప్పాల అశోక్, ఫ్లోర్ లీడర్ దుర్గయ్య ఉన్నారు.

అక్షర చిట్‌ఫండ్స్‌పై మరో కేసు నమోదు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 1: చిట్ డబ్బులు ఇవ్వకుండా, వడ్డీ చెల్లిస్తామని డిపాజిట్ చేయించుకుని మోసం చేసినట్లు వచ్చిన ఫిర్యాదుతో కరీంనగర్‌లోని అక్షర చిట్‌ఫండ్స్‌పై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. కొద్ది రోజుల క్రితం అక్షర చిట్‌ఫండ్స్ యాజమాన్యంపై కేసులు నమోదుకాగా, ఎండీ, డైరెక్టర్లను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం గాలిపల్లికి చెందిన మిట్టపల్లి భాగ్య అనే మహిళ 2019లో రాజీవ్‌చౌక్‌లోని అక్షర చిట్‌ఫండ్స్‌లో 5 లక్షల చిట్ వేసి, లిఫ్ట్ చేయగా ఆమెకు 3,87,418 రూపాయలు వచ్చాయి. ఆ డబ్బులను చెల్లించకుండా ఖతాదారుకు మాయమాటలు చెప్పి అక్షర టౌన్‌షిప్ సంస్థలో డిపాజిట్ చేస్తే 18 శాతం వడ్డీ ఇస్తామని 4 లక్షల రూపాయలు డిపాజిట్ చేయించుకున్నారు. అప్పటి నుంచి ప్రతి నెల 6 వేల వడ్డీ 2023 సంవత్సరం నుంచి చెల్లించడం లేదు. అలాగే భాగ్య కూతురు, మరి కొందరు బంధువులను కూడా అక్షర చిట్‌ఫండ్స్ యజమాని, డైరెక్టర్లు ఇలాగే మోసం చేశారని బాధితురాలు సోమవారం కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అక్షర చిట్‌ఫండ్స్ మేనేజింగ్ డైరెక్టర్ పేరాల శ్రీనివాసరావు, డైరెక్టర్లు శ్రీవిద్య, ఎస్ కొండల్‌రావు, పుప్పాల రాజేందర్, గోనె రమేష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఎంపీటీసీపై అట్రాసిటీ కేసు

మల్యాల, ఏప్రిల్ 1: మండలంలోని బల్వంతాపూర్ ఎంపీటీసీ సంగని రవిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. మల్యాల ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపిన వివరాల ప్రకారం.. మార్చి 16న మండలంలోని మ్యాడంపల్లి శివారులో మల్యాల ఎంపీపీపై అవిశ్వాస సమావేశం గురించి చర్చించేందుకు సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో పలువురు ఎంపీటీసీలు పాల్గొనగా ఎంపీపీ అవిశ్వాస తీర్మానంపై మాట్లాడుకుంటుండగా ఎంపీటీసీ రవి నూకపల్లి ఎంపీటీసీ భర్త మారంపల్లి నారాయణను కులం పేరుతో దూషిస్తూ చంపుతానని బెదిరించాడు. ఆదివారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. 2న ఎంపీపీ అవిశ్వాస సమావేశం ఉండగా ఎంపీటీసీపై కేసు నమోదు కావడం చర్చణీయాంశంగా మారింది

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో నలుగురికి జైలు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 1: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో నలుగురు వ్యక్తులకు జైలుశిక్ష పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 20మంది వాహనదారులను పోలీసులు సోమవారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా ఒకరికి 10 రోజులు జైలు శిక్ష, మరొకరికి 7 రోజులు, ఇద్దరికి 3 రోజుల జైలుశిక్ష, ముగ్గురికి కలిపి 10 వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. మిగతా 16 మంది వాహనదారులకు 23 వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 1: మండలంలోని రాజేశ్వర్‌రావుపేట గ్రామ శివారులోని వరద కాలువ బ్రిడ్జి వద్ద సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో కథలాపూర్ మండలంలోని పోతారం గ్రామానికి చెందిన వెలుమల దీక్ష(20) అనే యువతి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ అనిల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం దీక్ష నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి గ్రామంలో ఉన్న తన అక్క ఇంటికి వెళ్లింది. తన బావ కొత్తపల్లి దీలిప్‌తో కలిసి ద్విచక్రవాహనంపై పోతారం తిరిగి వస్తుండగా మండలంలోని రాజేశ్వర్‌రావుపేట వరద కాలువ బ్రిడ్జి వైపు వస్తున్న టిప్పర్ ఒక్కసారిగా జాతీయ రహదారిపైకి వేగంగా వచ్చి నిర్లక్ష్యంగా యూటర్న్ తీస్తుండగా బైక్‌ను ఢీకొట్టింది. దీంతో వెనుకాల కూర్చున్న దీక్ష టిప్పర్ టైర్ల కింద పడి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్‌ఐ అనిల్ తెలిపారు. బావ దీలిప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పెర్కొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



పిట్టల సంపత్

మానకొండూర్, ఏప్రిల్ 1: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన పిట్టల సంపత్ (36) అనే రైతు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో సోమవారం మృతి చెందినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. లింగాపూర్‌కు చెందిన సంపత్ గ్రామంలో రెండు ఎకరాల పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసుకుంటున్నాడు. రెండు రోజులుగా వ్యవసాయ బావి మోటార్ పనిచేయకపోవడంతో అదే గ్రామంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి ఆఫ్ చేసే క్రమంలో విద్యుదాఘాతంతో పడిపోయాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య పిట్టల మమత ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్

- పరారీలో మరో నిందితుడు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 1 : మహిళ హత్య కేసులో ఒక నిందితుడిని అరెస్ట్ చేయగా మరో నిందితుడు పరారీలో ఉన్నాడని ఎస్పీ అఖిల్ మహజన్ అన్నారు. సోమవారం సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. బీహార్‌కు చెందిన ఇద్దరు 6 నెలల క్రితం కూలి కోసం సిరిసిల్లకు వచ్చారన్నారు. సిరిసిల్లలోని అశోక్‌నగర్‌లో గది అద్దెకు తీసుకొని పనిచేసుకుంటూ జీవిస్తున్నారు. రుదల్ సదా, రామ్నిక్స్ సదా ఇద్దరు కూలి చేసే వద్ద వేములవాడ అర్బన్ మండలానికి చెందిన ఓ మహిళతో పరిచయం పెంచుకున్నారు. మార్చి 19న సాయంత్రం 6 గంటలకు కూలి పని అయిన తర్వాత ఆమెను రూమ్‌కి తీసుకెళ్లారు. మహిళ,ఇద్దరు కార్మికులు మద్యం తాగి అదే మత్తులో ఒకరు లైంగిక కోరిక తీర్చుకొని మరొకరు అనుభవించే క్రమంలో ఆమె మత్తు నుంచి తేరుకోవడంతో ప్రతిఘటించడంతో ఎవరికైనా విషయం చెపుతుందనే అనుమానంతో రూమ్‌లో ఉన్న సిలిండర్ బుడ్డితో ఆమె తలపై కొట్టి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం బీహార్‌కు పారిపోయారని తెలిపారు. ఈ హత్యపై సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి డీఎస్పీ ఆధ్వర్యంలో సిరిసిల్ల టౌన్ సి.ఐ రఘుపతి, టాస్కోఫోర్స్ సి.ఐ ప్రవీణ్‌కుమార్, ఎల్లారెడ్డిపేట్ ఎస్.ఐ రమాకాంత్, టాస్కఫోర్స్ సిబ్బందితో స్పెషల్ టీం ఏర్పాటు చేసి, బీహార్ రాష్ట్రం ఖగారియా జిల్లా అనాపూర్ మారన్ గ్రామానికి చెందిన రామ్నిక్స్ సదా (37)ను అరెస్టు చేశామన్నారు. మరోనిందితుడైన రుదల్ సదా పరారీలో ఉన్నాడని ఎస్పీ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ప్రారంభిస్తున్న డీఆర్‌డీపీ పీడీ శేషాద్రి రావు

కోనరావుపేట, ఏప్రిల్ 1 : కోనరావుపేట మండలంలోని జై సేవాలాల్ ఊరు తండాలో ఐకేపీ ఆధ్వర్యంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఆర్‌డీఏ పీడీ శేషాద్రిరావు ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా డీపీఎం పాపారావు, ఏపీఎం శ్రీనివాస్, రాకేష్, సమైక్య అధ్యక్షురాలు యమున తదితరులు పాల్గొన్నారు.

● సింగిల్‌విండో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు స్వాధీనం చేసుకోవాలని సింగిల్ విండో చైర్మన్ బండ నర్సయ్య అన్నారు. మండలంలోని నిజామాబాద్ గ్రామంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని అన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ అనుపాటి బాలరెడ్డి, వైస్ ఎంపీపీ వంగపల్లి సుమలత, తాళ్లపల్లి ప్రభాకర్ పాల్గొన్నారు.

వీర్నపల్లి : కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని ఐకేపీ ఏపీఎం నర్సయ్య అన్నారు. వీర్నపల్లి మండలం జవహర్‌లాల్ నాయక్ తండాలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఈవో ఫజల్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. సెంటర్ బుక్ కీపర్ తిరుపతి పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం డీసీఎంఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్కు వచ్చిన ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే తూకం వేయనున్నట్లు చెప్పారు.



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బండ నర్సయ్య

రైతులు, నేతన్నలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 1: రైతన్నలతోపాటు సంక్షోభంలో ఉన్న నేతన్నలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి రాణి రుద్రమరెడ్డి డిమాండ్ చేశారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వడగళ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలతోపాటు నీళ్ల లేక ఎండిపోయిన పంటలకు పరిహారం చెల్లించాలన్నారు. సిరిసిల్లలో సంక్షోభంలో ఉన్న వస్త్ర పరిశ్రమ సమస్యలను పరిష్కరించాలని, బకాయిలను చెల్లించి నేతన్నలకు ఉపాధిని కల్పించాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లలో మూతబడిన వస్త్ర పరిశ్రమలను తెరిపించాలని, నేతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధిని కల్పించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు చెతికొచ్చే సమయంలో కురిసిన అకాల వర్షాలతో పాటు వడగళ్లకు పంటలు దెబ్బతిన్నాయని, నీళ్లలేక పంటలన్నీ ఎండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. వారిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవడంతోపాటు ఎకరానికి రూ.25 వేలపరిహారం అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఎకరానికి రూ.10వేల పరిహారం ఇంత వరకు అందలేదన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని ఆంక్షలు లేకుండా కొనుగోలు చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిందని, దాని ప్రకారమే కోతలు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.



వినతి పత్రాన్ని అందిస్తున్న నాయకులు

నేతన్నలకు ఉపాధిని కల్పించాలి

వస్త్ర పరిశ్రమలకు ఖిల్లాగా పేరొందిన సిరిసిల్లలో నేడు వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందని, గత ప్రభుత్వం తయారు చేయించిన బతుకమ్మ చీరకుల రావాల్సిన బకాయిలను చెల్లించకపోవడంతో వస్త్ర పరిశ్రమలను యాజమానులు బంద్ చేశారని రాణి రుద్రమరెడ్డి అన్నారు. దీంతో నేతన్నలకు మూడు నెలల నుంచి ఉపాధి లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ప్రభుత్వ ఆర్డర్‌లను ఇవ్వకపోగా బతుకమ్మ చీరల తయారీని నిలిపి వేయడంతో నేతన్నలకు ఉపాధిని లేకుండా చేసిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రూ.290 కోట్ల బకాయిలను విడుదల చేయాలన్నారు. గత సంవత్సరం తయారు చేసిన బతుకమ్మ చీరలకు నేతన్నలకు రావాల్సిన పదిశాతం యారన్ సబ్సిడీ అందించాలన్నారు. ఉపాధిని కల్పించేందుకు ప్రభుత్వ ఆర్డర్‌లను అందించాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లలో రైతన్న, నేతన్నలకు ప్రభుత్వం ఆదుకోవాలంటూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలను కొనసాగిస్తామన్నారు. అంతకుముందువినతిపత్రాన్ని అందించేందుకు వచ్చిన రాణి రుద్రమరెడ్డితోపాటు నాయకులను కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట పోలీసులు అడ్డుకున్నారు. దీంతో తాము ఆందోళనలు చేయబోమని కేవలం వినతి పత్రాన్ని అందించి శాంతియుతంగా వెళ్లిపోతామని చెప్పడంతో పోలీసులు అనుమతి ఇచ్చారు. పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ కారెడ్ల మల్లారెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బర్కం వెంకటలక్ష్మీ, పట్టణ అధ్యక్షురాలు పండుగ మాధవి, రాష్ట్ర నాయకులు గరిపెల్లి ప్రభాకర్, బర్కం నవీన్, పర్శరాములు, సుంకరి బాలకిషన్, కైలాస్ పాల్గొన్నారు.

నేడు సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 1 : సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంఘం విస్తృత స్థాయి సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎగమంటి ఎల్లారెడ్డి తెలిపారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పట్టణంలోని నెహ్రూనగర్‌లోని ఆర్ఎంపీ, పీఎంపీ భవనంలో నిర్వహించనున్న సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి కోటం రాజు హాజరుకానున్నారని, కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, జిల్లా సహాయ కార్యదర్శి ఎలిగేటి రాజశేఖర్, ఒగ్గు గణేష్, పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి రావాలని బీసీ నేతకు ఆహ్వానం



పుష్పగుచ్ఛం అందజేస్తున్న పర్శహన్మండ్లు దంపతులు

గంభీరావుపేట, ఏప్రిల్ 1 : గంభీరావుపేట మండలం శ్రీగాధకు చెందిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లును కాంగ్రెస్‌లోకి రావాలని సిరిసిల్ల నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి ఆహ్వానించారు. ఇంటికి వెళ్లి పర్శ హన్మండ్లు దంపతులతో కేకే మహేందర్‌రెడ్డి చర్చించారు. సన్నితులతో చర్చించి, త్వరలో తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని హన్మండ్లు చెప్పినట్టు సమాచారం. బీసీ ఉద్యమకారుడిగా, ముదిరాజ్ సామాజిక వర్గం నాయకుడిగా హన్మండ్లుకు పేరుంది. ప్రజా సమస్యల ఉద్యమ క్రమంలో హన్మండ్లు రెండుసార్లు జైలుకు వెళ్లారు. హన్మండ్లు భార్య పర్శ స్నేహలత గతంలో శ్రీగాధ సర్పంచ్‌గా, ప్రస్తుతం కోళ్లమద్ది ఎంపీటీసీగా పనిచేస్తున్నారు. 2014లో కాంగ్రెస్ పార్టీ తరపున పర్శ హన్మండ్లు జడ్పీటీసీగా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు.

కట్టమైసమ్మ పండగ నిర్వహణ కమిటీ

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 1: ఎల్లారెడ్డిపేట మండలానికి ప్రధాన సాగు నీటి వనరైన సింగసముద్రం చెరువు కట్టమైసమ్మ పండగ నిర్వహణ కమిటీ ప్రతినిధులను సోమవారం మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఎన్నుకున్నారు. ప్రతినిధులుగా ఒగ్గు బాలరాజుయాదవ్, సద్ది లక్ష్మారెడ్డి ఎన్నికయ్యారు. సభ్యులుగా రాంరెడ్డి, బాల్‌రెడ్డి, రాజయ్య, ఎల్లయ్య, మల్లయ్య, తిరుపతిరెడ్డి, విఠల్‌రెడ్డి, బాలయ్య, నర్సయ్య, పోచయ్య, గోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి వ్యవహరించనున్నారు. ఈ నెల 7న నిర్వహించనున్న కట్టమైసమ్మ పండగ ఖర్చుల నిమిత్తం ఆయకట్టు రైతులు ఎకరాకు రూ.200 చెల్లించాలని నిర్ణయించారు. వరి కోత యంత్రాల యజమానులు కమిటీ నిర్ణయం మేరకు డబ్బులు తీసుకోవాలన్నారు. రైతుల వద్ద అధికంగా వసూలు చేస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ నెల 3న స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ధరలను నిర్ణయించేందుకు సమావేశం ఏర్పాటు చేయనున్నామని రైతులు పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్‌కు మాజీ ఉప సర్పంచ్ రాజీనామా

గంభీరావుపేట, ఏప్రిల్ 1 : గంభీరావుపేట మండలం దమ్మన్నపేట మాజీ ఉప సర్పంచ్ అరుట్ల అంజిరెడ్డి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యకు తన రాజీనామా లేఖను పంపించారు. పార్టీ ఆవిర్భావం నుంచజ బీఆర్ఎస్‌లో క్రియాశీలకంగా పాల్గొన్నారు. వ్యక్తిగత కారణాలతోనే బీఆర్ఎస్‌కు, క్రియాశీలక సభ్యత్వానికి తాను రాజీనామా చేస్తున్నట్టు వెల్లడించారు.

రుద్రవరంలో మాజీ ప్రజాప్రతినిధులు..

వేములవాడ టౌన్, ఏప్రిల్ 1 : వేములవాడ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు, సర్పంచ్ ఊరడి రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ వంకాలయ భూమయ్య బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. కొంత కాలంగా బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నామని, వ్యక్తిగత కారణాలతో పార్టీ నుంచి వైదోలుగుతున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడికి లేఖ పంపినట్లు తెలిపారు.

నేతన్నలను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

తంగళ్లపల్లి, ఏప్రిల్ 1: కాంగ్రెస్ ప్రభుత్వం నేతన్నలకు పాత బకాయిలు చెల్లించడం లేదని, కొత్తగా పని కల్పించింది లేదని బీఆర్ఎస్ నాయకులు గజభీంకర్ రాజన్న, మాట్ల మధు మండిపడ్డారు. సోమవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాటాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేటీఆర్ సిరిసిల్ల ప్రాంతాన్ని వేలాది కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశారన్నారు. కాంగ్రెస్ నేత కేకే మహేందర్ రెడ్డి ఇష్టారాజ్యంగా మాట్లాడడాన్ని ఖండించారు. ప్రభుత్వంలో ఉండి నేతన్నల బకాయిలు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇసుక దోపిడీ జరిగిందని, బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే మైనింగ్ పాలసీ తెచ్చి ప్రభుత్వానికి ఆదాయాన్ని చేకూర్చామని అన్నారు. ఎండాకాలంలో సైతం చెరువులు నింపి పంటలకు సాగునీరు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఎంపీపీ పడిగల మానసరాజు, నాయకులు సింగిరెడ్డి రవీందర్‌రెడ్డి, వలకొండ వేణుగోపాలరావు, పూసపల్లి సరస్వతి, ఎగుమావిడి వెంకటరమణారెడ్డి, కొయ్యడ రమేష్, కర్నె బాలయ్య, క్యారం జగత్, కందుకూరి రామాగౌడ్, కోడం సంధ్యారాణి, బండి జగన్, అవధూత మహేందర్, సురభి నవీన్‌రావు, రాజయ్య, సద్ద రోజా, అంజయ్య, నక్క కొమురయ్య తదితరులు పాల్గొన్నారు

బ్యాంకు రుణం కోసం నకిలీ ధ్రువీకరణ పత్రం తయారీ

చందుర్తి, ఏప్రిల్ 1 : బ్యాంకు రుణం కోసం ఓ ఇంటి ధ్రువీకరణ పత్రంపై గ్రామపంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు చందుర్తి ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. చందుర్తి మండలం జోగాపూర్ గ్రామానికి చెందిన బుర్ర వెంకటేష్ ఓ బ్యాంకులో ఇంటి నిర్మాణ రుణం పొందేందుకు గ్రామ పంచాయతీ కార్యదర్శి నుంచి ధ్రువీకరణ పత్రం అవసరమైంది. దీంతో గ్రామపంచాయతీ కార్యదర్శి ఎర్రం కవిత సంతకాన్ని ఫోర్జరీ చేశాడు. బ్యాంకు అధికారులకు రుణం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. బ్యాంకు అధికారులు పంచాయతీ కార్యదర్శిని విచారించగా ధ్రువీకరణ పత్రం తాను ఇవ్వలేదని తెలపడంతో విషయం బయటకు వచ్చింది. గ్రామపంచాయతీ కార్యదర్శి నకిలీ ధ్రువపత్రమని నిర్ధారించుకొని చందుర్తి పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నర్మాలలో ఇఫ్తార్ విందు

గంభీరావుపేట, ఏప్రిల్ 1 : గంభీరావుపేట మండలం నర్మాల గ్రామంలో ముస్లింలకు ప్రైవేటు వైద్యుడు బొంగు మల్లేశం యాదవ్ సోమవారం మసీదులో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మసీద్ కమిటీ అధ్యక్షుడు ఖాసీం, ఉపాధ్యక్షుడు అహ్మద్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి షేక్ షబ్బీర్, కోశాధికారి ఆసీఫ్ తదితరులు ఉన్నారు.

కన్నుల పండుగగా మల్లికార్జునస్వామి కల్యాణం



పట్నం వేస్తున్న ఒగ్గు పూజారులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 1 : ఎద్దుగుట్ట మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవం ఒగ్గు డప్పు చప్పుళ్ల మధ్య కన్నుల పండువగా సాగింది. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్, బోనాల, చిన్నబోనాల పరిధిలో ఎద్దుగుట్ట మల్లికార్జునస్వామి జాతరను యాదవ సంఘాల ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్నారు. ఎద్దుగుట్ట మల్లన్న కల్యాణ మహోత్సవానికి పెద్దూర్ శివారులోని ఎద్దుగుట్ట మల్లన్న ఆలయంలో భారీ ఏర్పాట్లు చేశారు. ఆదివారం సాయంత్రం పెద్దూర్,బోనాల, చిన్నబోనాల గ్రామాల్లోని యాదవ కులస్థులు పుట్టమన్నులతో బోనాలను తీసుకవెళ్లారు. అదే రోజు రాత్రి ఒగ్గు కళాకారులు సుంకు బియ్యం చేపట్టి లగ్న పట్నం వేశారు. సోమవారం ఆలయంలో నాగవెల్లి పట్నం వేసి మల్లన్న కల్యాణాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి కల్యాణంలో పాల్గొన్నారు. ఈ జాతరకు పెద్దూర్ ప్రజలను ఎద్దు గుట్టవద్దకు తరలించేందుకు గ్రామానికి చెందిన గోపాల యూత్ ఆధ్వర్యంలో ఉచితం రవాణా సౌకర్యాన్ని కల్పించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, మాజీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, మాజీ జిల్లా అధ్యక్షుడు నాగుల సత్యనారాయణగౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, కౌన్సిలర్‌లు లింగంపల్లి సత్యనారాయణ, మురళి ప్రత్యేక పూజలు చేశారు. పెద్దూర్ యాదవ సంఘం అధ్యక్షుడు గంగుల మల్లయ్యయాదవ్, ఉపాధ్యక్షుడు గంగుల భాస్కర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి గోడుగు చిన్న ఎల్లయ్యయాదవ్, కోశాధికారి సలేంద్రి రవియాదవ్, పెద్దూర్ సింగిల్ విండో చైర్మన్ జీలకిషన్‌యాదవ్, సలేంద్రి వేణుగోపాల్‌యాదవ్ పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్ చేతగానితనంతోనే సముద్రంలోకి నీళ్లు



మిడ్‌మానేరును పరిశీలిస్తున్న వినోద్‌కుమార్

బోయినపల్లి, ఏప్రిల్ 1:కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనం, అసమర్థత కారణంగానే మేడిగడ్డ దగ్గర గోదావరి నది నుంచి వేల క్యూసెక్కుల నీళ్లు వృథాగా సముద్రంలో కలుస్తున్నాయని, తెలంగాణలో పదేళ్లలో లేని కరువు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వచ్చిందని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. బోయినపల్లి మండలం శాభాష్ పల్లి వద్ద నీరు అడుగంటిన మధ్యమానేరు ప్రాజెక్టును సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడిగడ్డ వద్ద మూడు పిల్లర్లు కుంగాయనే సాకుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టులను గాలికొదిలేసిందని, ఈ యాసంగి సీజన్‌లో ఎన్నడూ చూడని కరువు వచ్చిందని అన్నారు. కుంగిన పిల్లర్ల దగ్గర చర్యలు తీసుకుంటే ప్రాజెక్టులు అడుగంటి పోయేవి కాదని, వరి కూడా ఎండకుండా ఉండేదని అన్నారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ సృష్టించిన కరువని అన్నారు. తెలంగాణలోని సాగునీటి ప్రాజెక్టులన్నీ డెడ్ స్టోరేజీకి పోతున్నాయని, ఇప్పుడు సాగునీళ్లు లేక పంటలు ఎండాయని అన్నారు. రాబోయే నెల రోజుల్లో తాగునీళ్లు లేక ప్రజల గొంతులు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్రంలో ప్రాజెక్టులు ఎండిపోయి కరువు వస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు తెరవాలని, మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు కుంగిన దగ్గర కాఫర్ డ్యాం నిర్మించాలని అన్నారు. జూలై నుంచి గోదావరి నదిలో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందన్నారు. సాగునీళ్లు లేక వేలాది ఎకరాల పొలాలు ఎండిపోయి రైతులు కన్నీరు పెడుతున్నారని, ప్రభుత్వం ఎండిన పంటలను వెంటనే సర్వే చేయించి రైతులకు ఎకరాకు రూ.20 వేల పంట పరిహారం ఇవ్వాలని అన్నారు. ఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొండయ్య, డాక్టర్ అమిత్, వైస్ ఎంపీపీ నాగయ్య, గుంటి శంకర్, మాజీ ఎంపీపీ భాగ్యలత, మాధవ్, కొంకటి శేఖర్, రమేష్, నరేష్, రాజు, మల్లేశం, సృజన్ రెడ్డి పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం కావాలి

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ బీఆర్ఎస్ కార్యకర్త పని చేయాలని, ఈసారి కరీంనగర్ గడ్డపై మళ్లీ గులాబీ జెండా ఎగురబోతోందని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. బోయినపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 ఏళ్ల సుదీర్ఘ పోరాటం అనంతరం తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని, పదేళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరుతో అబద్ధాలు ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రజలు మార్పు కోరుకున్నది మంచి చేస్తారని, ఇలా మోసం చేస్తారని కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో మూడు నెలల్లోనే వ్యతిరేకత మొదలైందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు యాసంగికి ఇస్తామన్న క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించాలని కోరారు.

పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠకు హాజరు

బోయినపల్లి మండల కేంద్రంలో పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠలో కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ హాజర య్యారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొండయ్య, డాక్టర్ అమిత్, వైస్ ఎంపీపీ నాగయ్య, శంకర్, మాజీ ఎంపీపీ భాగ్యలత, మాధవ్, శేఖర్, మాజీ సర్పంచ్‌లు రమేష్, నరేష్, రాజు, మల్లేశం, ఎంపీటీసీల సృజన్ రెడ్డి పాల్గొన్నారు.

బీరప్ప వేడుకలకు హాజరైన ప్రభుత్వ విప్

చందుర్తి, ఏప్రిల్ 1 : చందుర్తి మండల కేంద్రంలో జరుగుతున్న బీరప్ప స్వామి కల్యాణం మహోత్సవాలకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. జడ్పీటీసీ నాగం కుమార్, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, మండల కో ఆప్షన్ సభ్యులు బత్తుల కమలాకర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, నాయకులు మ్యాకల గణేష్, పులి సత్తయ్య, భీమరాజు కనకరాజు, గొట్టే ప్రభాకర్, ధర్మపురి శ్రీనివాస్, మహేష్, రవి పాల్గొన్నారు.

రైతులకు భరోసా ఇచ్చేందుకు దీక్ష

- బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, ఏప్రిల్ 1: సాగునీరు లేక రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని, వారికి భరోసా కల్పించేందుకే రైతు దీక్ష నిర్వహిస్తున్నామని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం కరీంనగర్‌లో ఎన్నికల నిర్వహణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని, సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని, రైతులకు అండగా నిలావాల్సిన రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందన్నారు. రైతులకు భరోసా కల్పించడానికి రైతు దీక్ష చేపడుతున్నామన్నారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై బీజేపీ శ్రేణులు పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ విధానాలనే అవలంబిస్తోందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నో హామీలిచ్చి నెరవేర్చలేదన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ, ఎకరాకు 15 వేల రైతు బంధు, కౌలు రైతులకు రైతు బంధు ఏమైందని ప్రశ్నించారు. కుంటి సాకులు చెప్పకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ రామడుగు వచ్చి పంట నష్టం ఇస్తానని చెప్పాడని, ఇప్పటి వరకు రైతులకు పరిహారం అందలేదన్నారు. కేసీఆర్‌కు రైతుల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. కరీంనగర్ రైతులకు క్షమాపణ చెప్పిన తరువాతనే కేసీఆర్ ఇక్కడ అడుగు పెట్టాలన్నారు. సమావేశంలో ఎస్ కుమార్, మీసాల చంద్రయ్య, గంగాడి కృష్ణారెడ్డి, బోయినపల్లి ప్రవీణ్‌రావు, డి.శంకర్ పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు

మెట్‌పల్లి, ఏప్రిల్, 1: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, అలసత్వం ప్రదర్శిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్ హెచ్చరించారు. సోమవారం మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మి కంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో నమోదు అయిన కేసుల వివరాలు, పరిష్కరిస్తున్న తీరును అడిగి తెలుసుకొని రికార్డులతో పాటు స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాలు, నేరస్తులు, రౌడీ షీటర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చిన బాధితుల ఫిర్యాదులు, ప్రజా సమస్యల పైన వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా బరోసా కల్పించాలన్నారు. జరగబోయే లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణలో జరిగేలా ఫ్లాగ్ మార్చ్, రూట్ మార్చ్‌లు నిర్వహించి ఓటర్లకు భద్రత భావాన్ని కల్పించాలన్నారు. అధికారులు, సిబ్బంది సాంకేతికంగా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, డయల్ 100కు కాల్ వచ్చిన వెంటనే స్పందించి సంఘటన స్థలంకు చేరుకొని బాధితులకు న్యాయం చేయాలన్నారు. ప్రజలకు సైబర్ నేరాలు, మోసాల గురించి అవగాహన కల్పించి చైతన్య పరచాలని సూచించారు. ఎన్నికల సమయంలో గొడవలు, అల్లర్లు సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే నేరస్థులపై, రౌడీషీటర్లపై నిఘా ఏర్పాటు చేయాలని, వారిని సంబంధిత అధికారుల ఎదుట బైండోవర్ చేయాలని పలు సూచనలు చేశారు. డీఎస్పీ ఉమామహేశ్వరరావు, సీఐ నవీన్‌కుమార్, ఎస్సై చిరంజీవి, సిబ్బంది, ఉన్నారు.

అన్నపై దాడి చేసిన తమ్ముడిపై కేసు

చందుర్తి, మార్చి 1: ఇంటి స్థలం విషయంలో అన్నపై దాడికి పాల్పడిన సంఘటనలో తమ్ముడిపై కేసు నమోదు చేసినట్లు చందుర్తి ఎస్సై శ్రీకాంత్ సోమవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని రామన్నపేట గ్రామానికి చెందిన గుండోజి రాజేశం, శ్రీనివాస్ ఇద్దరు అన్నదమ్ములు. ఇంటి స్థలం విషయంలో మార్చి 31న రాత్రి గొడవ పడ్డారు. ఇద్దరి మధ్య స్వల్ప ఘర్షణ జరగడంతో అన్న రాజేశంపై తమ్ముడు శ్రీనివాస్ గొడ్డలి కామతో దాడి చేశాడు. ముఖంపై నోటితో కరచి గాయపరిచాడు. దీంతో శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

చందుర్తి, ఏప్రిల్ 1 : చందుర్తి మండల కేంద్రంలో అనుమతులు లేకుండా ఎర్ర మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు చందుర్తి ఎస్సై శ్రీకాంత్ సోమవారం తెలిపారు. చందుర్తి మండల కేంద్రానికి చెందిన పల్ల మహేష్ రామన్నపేట గ్రామ శివారు నుంచి చందుర్తికి అక్రమంగా ట్రాక్టర్‌లో ఎర్రమట్టిని తరలిస్తున్నాడు. చందుర్తిలో పట్టుకొని, కేసు నమోదు చేసి తహసీల్దార్‌కు పంపినట్లు తెలిపారు.



వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

రైతుల సమస్యలు పరిష్కరించాలి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 1: రైతుల సమస్యలు పరిష్కరించాలంటూ బీజేపీ ఆధ్వర్యంలో ఆర్ఐ షఫీకి సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా మండల కిసాన్‌మోర్చా అధ్యక్షుడు చింతలపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వడగళ్ల వానతో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్లు రెండు లక్షల వరకు రుణమాఫీ చేయాలన్నారు. రైతుభరోసా పథకం కింద ఎకరానికి రూ.15వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వెంటనే ధాన్యం సేకరించాలని, రూ. 500 బోనస్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా దళిత మోర్చా ప్రధాన కార్యదర్శి మామిడి హరీష్, మండల ప్రధాన కార్యదర్శి తిప్పారపు శ్రావణ్, ఓరుగంటి శేఖర్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: అకాల వర్షాలకు నష్టపోయిన వరికి ఎకరాకు రూ.20 వేలు పరిహారం చెల్లించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. అన్నదాతల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎల్లారెడ్డిపేట తహసీల్ అధికారులు ఆ పార్టీ నాయకులు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు దాసరి గణేశ్ మాట్లాడుతూ పంటలు ఎండిపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. రాయితీ విత్తనాలు, పసల్ బీమా వర్తింపజేయాలన్నారు. వడగళ్ల వానకు నష్టపోయిన మామిడి రైతులకు ఎకరాకు రూ.లక్ష పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం నాయబ్ తహసీల్దార్ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. నాయకులు కృష్ణహరి, బాలయ్య, కిరణ్‌నాయక్, రవి, వెంకటేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: రైతుల సమస్యలను పరిష్కరించాలంటూ బీజేపీ శ్రేణులు తంగళ్లపల్లి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి : ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేపీ మండల అధ్యక్షుడు గునుగుల దేవేందర్ రెడ్డి అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం పార్టీ నాయకులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడగండ్ల వానకు పంట నష్టపోయిన రైతులకు పరిహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు బోడ మల్లేశం, నాయకులు రమేష్ నాయక్, పీర్యా తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు పరుచాలని బీజేపీ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. బీజేపి పట్టణ అధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు నాయకులు అక్కనపెల్లి వివేక్‌రెడ్డి, మేరుగు లక్ష్మణ్, గుడిసె మనోజ్, బిళ్ల కృష్ణ, నర్సయ్య, లక్ష్మిరాజం, కోల మారుతి, సగ్గు రాహుల్, అశోక్, సాయి తదితరులు ఉన్నారు.

వేములవాడ రూరల్: రైతులకు వెంటనే సాగు నీరందించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేలా చూడాలని సోమవారం రూరల్ తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి మాట్లాడుతూ అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు పరిహారం చెల్లించాలన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చందుర్తి : చందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో పంటలు ఎండిపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని, రైతుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం తహసీల్దార్‌కు బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో నాయకులు వినతి పత్రం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు పోంశెట్టి రాకేష్, నాయకులు చింతకుంట గంగాధర్, పేరుక గంగరాజు, గడి కొప్పుల జీవన్, ఆది రవి, మెంగని రాజేందర్, శ్రీనివాస్, పరశురాములు, బోరిగాయ తిరుపతి, మర్రి రాజు, సంపునూరి దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట : బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ విజయరామారావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. పంటలు ఎండిపోయి నష్టపోతున్న రైతన్నలను ఆదుకోవాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గొట్టె రామచంద్రం అన్నారు. నాయకులు గోపాడి సురేందర్‌రావు, మండల నాయకులు మోహన్, బెంద్రే శ్రీనివాస్ రెడ్డి, పాక మహేష్, లచ్చిరెడ్డి, నరసయ్య, మల్లయ్య భాస్కర్, శ్రీనివాస్, లింగయ్య ఉన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు